క్లుప్తంగా

206 పొగాకు బేళ్లు కొనుగోలు

కనిగిరి రూరల్: కనిగిరి పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం జరిగిన వేలంలో 206 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. వరిమడుగు, గుదేవారిపాలెం, కమ్మవారిపల్లి, మురిగమ్మి, నేరెడుపల్లి, పీసీపల్లి, అలవలపాడు రేగడ, వెంగళాపురం గ్రామాల నుంచి 226 పొగాకు బేళ్లు వేలానికి రాగా 206 బేళ్లను కొనుగోలు చేసి 20 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధరరూ.200, కనిష్ట ధరరూ.190 పలికినట్లు వేలంనిర్వహణాధికారి బి.కోటేశ్వరరావు తెలిపారు.

పొగాకు గరిష్ట ధర కేజీ రూ.200



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న శ్రీనివాసరావు

టంగుటూరు: అన్య పదార్థాలు లేని, 150 కేజీలకు మించని పొగాకు బేళ్లను మాత్రమే రైతులు వేలం కేంద్రానికి తీసుకురావాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం కె.ఉప్పలపాడు గ్రామ రైతులు 810 బేళ్లను తీసుకురాగా 633 కొనుగోలయ్యాయి. 154 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. గరిష్ట ధర కేజీ రూ.200 కాగా, కనిష్ట ధర రూ.195, సరాసరి ధర రూ.197.62 పలికింది. వేలంలో 10 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

21న బహిరంగ వేలం

కందుకూరు అర్బన్: స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాల ఎదురుగా గుడ్‌విల్ ఆక్షన్ కింద నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణాలను లీజుకు ఇచ్చేందుకు ఈ నెల 21న మున్సిపల్ కార్యాలయంలో బహిరంగవేలం నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎస్. మనోహర్ తెలిపారు. గతంలో షాపులు పాట పాడుకుని మొదటి వాయిదా చెల్లించకపోవడంతో రద్దు చేసిన లీజుదారులు, వారి కుటుంబసభ్యులు వేలంలో పాల్గొనేందుకు అనర్హులని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు దరావత్తు కింద రూ.50 వేలు చెల్లించాలని, సాల్వెన్సీ, ప్రాపర్టీపత్రం రూ.2.50 లక్షలు దాఖలు చేయాలన్నారు.

రూ.50 లక్షలతో అభివృద్ధి పనులు



రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

కనిగిరి రూరల్: పట్టణంలోని 11వ వార్డు పరిధిలో టకారిపాలెంలో రూ. 50లక్షలతో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఎస్‌కేఅబ్దుల్ గఫార్ అన్నారు. మంగళవారం పట్టణంలో టకారిపాలెంలో పర్యటించి, నిర్మాణంలో ఉన్న రోడ్లు, డ్రైనేజీ కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ అబ్దుల్ గఫార్ దశల వారీగా అన్నివార్డుల్లో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ముస్లిం మైనార్టీ వర్గాలు అత్యధికంగా నివసించే టకారిపాలెంలో రోడ్లు, డ్రైనేజీ పనులు ప్రాధాన్యతగా నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ షంషీర్, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి పండుగకు రూ.లక్ష విరాళం



గుత్తి శ్రీధర్‌ను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

కనిగిరి రూరల్: శ్రీరామనవమి పండుగను ఘనంగా నిర్వహించేందుకు ఇస్కాన్ బృందం సభ్యుడు గుత్తి శ్రీధర్ రూ.లక్ష విరాళాన్ని శ్రీరామభక్త సమాజం కమిటీకి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో శ్రీరామ భక్త సమాజం కమిటీ అధ్యక్షుడు బచ్చు వెంగయ్య గుప్తా, అంగులూరి అనీల్‌కుమార్, అద్దంకి వెంకటేశ్వర్లు, కొలిపాకుల దుర్గాశ్రీను, చక్కావర, కొలిపాకుల రమేష్, నాదేళ్ల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. కమిటీ సభ్యులు గుత్తి శ్రీధర్‌ను సన్మానించారు.

నూరుశాతం పన్నులు వసూలు చేయాలి

కనిగిరి రూరల్: ఇంటిపన్నులు నూరుశాతం వసూలు చేయాలని కమిషనర్ డీవీఎస్ నారాయణరావు అన్నారు. స్థానిక మున్సిపల్ ఆఫీసులో సచివాలయ అడ్మిన్‌లు, సెక్రటరీలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ డీవీఎస్ నారాయణరావు మాట్లాడుతూ ఆస్తి, నీటి పన్నులు మార్చి 31 లోగా వందశాతం వసూలు చేయాలని ఆదేశించారు. పన్నులు చెల్లించని వారిని గుర్తించి అవగాహన కల్పించాలని సూచించారు. పన్నులు చెల్లించేందుకు సెలవు దినాల్లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని తెలిపారు.



మాట్లాడుతున్న కమిషనర్ డీవీఎస్

మంచి రోజులొచ్చాయ్..!

- ప్రభుత్వ పాఠశాలలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- మహమ్మదాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.కోటి వెచ్చించి సౌకర్యాల కల్పన
- కార్పొరేట్‌ను తలదన్నేలా సౌకర్యాలు
- భారీగా పెరిగిన విద్యార్థులు



మహమ్మదాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

హనుమంతునిపాడు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలకు మంచి రోజులొచ్చాయ్.. గతంలో కనీస సౌకర్యాలు కరువై పాత భవనాల్లో కునారిల్లుతున్న పాఠశాలలు నేడు ప్రైవేట్ పాఠశాలలను తలదన్నేలా తయారయ్యాయి. ఇందుకు మండలంలోని మహమ్మదాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఒక ఉదాహరణ. ప్రభుత్వ కృషితో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

ప్రభుత్వ పాఠశాలకే మొగ్గు..

మహమ్మదాపురం గ్రామంలో తల్లిదండ్రులు ఎవ్వరూ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపించడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివిస్తున్నారు. గత టీడీపీ హయాంలో పాఠశాల కనీస సౌకర్యాలు కరువయ్యాయి. పాఠశాలలో గతంలో బాలికల తక్కువ మంది ఉండేవారు. కానీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సౌకర్యాలు మెరుగుపడి విద్యాబోధనలో సైతం గణనీయమైన మార్పు రావడంతో బాలికల హాజరు శాతం పెరిగింది. ప్రస్తుతం పాఠశాలలో 394 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వారిలో పదో తరగతి విద్యార్థులు 69 మంది ఉన్నారు. గత నాలుగేళ్లుగా పదో తరగతిలో నూరుశాతం ఫలితాలు సాధిస్తున్నారు. దీంతో పాఠశాల మండలంలో మంచి పేరు సాధించింది.

నాడు–నేడు కింద రూ.కోటితో అభివృద్ధి పనులు

నాడు–నేడు పథకం కింద పాఠశాలలో రూ.1.02 కోట్లతో పనులు జరుగుతున్నాయి. మొదటి విడతలో రూ.56 లక్షలతో అభివృద్ధి పనులు జరగ్గా..రెండో విడతలో నాలుగు అదనపు గదుల నిర్మాణానికి రూ.46 లక్షలు కేటాయించగా పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రభుత్వం అందిస్తున్న అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యా కానుక, స్వేచ్ఛ ఆంగ్ల మీడియం, నాడు నేడు డిజిటల్ తరగతులు. స్పోకెన్ ఇంగ్లిష్ ప్రత్యేక తరగతులు, ప్రత్యేక శిక్షణతో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నారు. విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో క్రమం తప్పకుండా సీట్లు సాధిస్తున్నారు.

దాతల సహరంతో కళావేదిక, గ్రంథాలయం ఏర్పాటు..

పూర్వ విద్యార్థులు సహకారంతో పాఠశాలల్లో రూ.70 వేలతో అన్నిరకాల పుస్తకాలతో గ్రంథాలయం ఏర్పాటు. దాతల సహకారంతో కళామందిర్, నీటి ట్యాప్‌లో, పాఠశాల ఆర్చీ ఏర్పాటు చేశారు.

విద్యార్థుల హాజరుశాతం పెరిగింది



ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వ చర్యలతో పాఠశాలలలో విద్యార్థుల హాజరు శాతం పెరిగింది. నాడు–నేడుతో పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు ఇద్దరు వంతున ఉన్నారు. ఏటా ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధిస్తున్నాం. గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 99 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

– రమణయ్య, పాఠశాల హెచ్‌ఎం



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుల



మధ్యాహ్న భోజనం చేస్తున్న బాలికలు

ఆరోగ్య రక్షణకు ఆల్‌బెండజోల్ మాత్రలు



గుడ్లూరులో ఆల్‌బెండజోల్ మాత్రలు మింగిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ



వెలిగండ్లలో ఆల్‌బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎంపీడీఓ



కనిగిరిలో విద్యార్థినులకు నులిపురుగుల మాత్రలు వేస్తున్న డాక్టర్ సృజన

గుడ్లూరు: విద్యార్థులు ఆరోగ్యకరంగా ఉండాలంటే నులి పురుగుల నివారణకు ఆల్‌బెండ జోల్ మాత్రలు మింగించాలని కందుకూరు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ప్రియంవద అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవంసందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. వైద్యాధికారి మారుతీరావు, సీహెచ్‌ఓ భాస్కరరావు, సూపర్‌వైజర్ ఆరీఫ్, వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు. పూరేటిల్లి గ్రామంలో వైద్యాధికారి మారుతీరావు పాల్గొని విద్యార్థులకు నులిపురుగులు నివారణ మాత్రలు పంపిణీ చేశారు.

లింగసముద్రం: జాతీయ నులిపురుగుల నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. సీహెచ్‌ఓ జి.శ్రీనివాసులు ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

వెలిగండ్ల: ఆరోగ్యకరమైన పిల్లల కోసం నులిపురుగుల నివారణే సరైన మార్గమని ఎంపీడీఓ టి సుకుమార్ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మాత్రలు వేశారు. ఎంఈఓ దాస్ ప్రసాద్, అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: పిల్లల ఆరోగ్య వంతమైన జీవితం కోసం నులిపురుగుల నివారణ మాత్రలను వేయాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సృజన అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నులిపురుగుల మందులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ మాత్రలతో రక్తహీనత తగ్గుతుందన్నారు. డాక్టర్లు ప్రియ హర్ష, టీబీ అధికారి బాబురావు, ఏఎన్‌ఎంలు, ఎస్తేరు రాణి, బాలుడు, గుడ్‌హె ప్రతినిధి మంద్రు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పీసీపల్లి: మండల పరిధిలోని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో వైద్యాధికారి రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు ఉన్నారు.

పామూరు: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలు వేశారు. డాక్టర్ ఎం విజయ్‌కుమార్, డాక్టర్ హరిబాబు, పాఠశాల హెచ్‌ఎం జిలానీబాషా, సీహెచ్‌ఓ మురళి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సీఎస్‌పురం: చిన్నారుల ఆరోగ్యం కోసం ఆల్‌బెండజోల్ మాత్రలు తినిపించాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఎస్ మురళి అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలు వేశారు. ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ, వైద్యులు ఎస్ మురళి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. ఎంపీడీఓ ఎం. క్రిష్టారావు, ఎంఈఓ జి.పెద్దిరాజు విద్యార్థులకు అవగాహన కల్పించారు. డాక్టర్ ప్రతాప్‌రెడ్డి, హెచ్‌ఎం జీవీ. సురేష్‌బాబు, బొప్పరాజు సుబ్బారావు, సీహెచ్‌ఓ కేవీ చేన్నయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం

సింగరాయకొండ: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 14,992 మంది విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు వైద్యాధికారి చైతన్యకృష్ణ తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈఓ బి శివన్నారాయణ, ప్రధానోపాధ్యాయురాలు డి.భారతి, ఉపాధ్యాయుడు హరేరామ్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జరుగుమల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమంలో ఎంపీడీఓ పి.రామకృష్ణ పాల్గొన్నారు. విద్యార్థులకు ఆరోగ్య జాగ్రత్తలు తెలియజేశారు. వైద్యాధికారి సరస్వతి మాట్లాడుతూ.. మండలంలో 2,726 మంది విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఎంఈఓ నాగేంద్రవదన్, సీహెచ్‌ఓ పి వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం మర్రి శ్రీనివాసరావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పొన్నలూరు: ఆల్‌బెండజోల్ మాత్రలు మింగితే చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని పీహెచ్‌సీ డాక్టర్ ఉన్నం కీర్తి పేర్కొన్నారు. పొన్నలూరు జెడ్పీ పాఠశాల్లో విద్యార్థులతో మాత్రలు మింగించారు. మంగళవారం 6304 పిల్లలకు మాత్రలు అందజేశామని చెప్పారు. చేతుల శుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.వెంకట్రావు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



సింగరాయకొండలో బాలికల హైస్కూల్లో మాత్రలు పంపిణీ చేస్తున్న వైద్యులు



జరుగుమల్లి హైస్కూల్లో విద్యార్థులతో మాత్రలు మింగిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ



పొన్నలూరులో మాత్రలు మింగిస్తున్న డాక్టర్ కీర్తి

దాతల సహకారానికి న్యాయం చేయాలి

సీఎస్‌పురం: విద్యార్థులు ఇష్టంతో చదివి మంచి మార్కులు సాధించి దాతలు అందించిన సహకారానికి న్యాయం చేయాలని ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని సి.నాగులవరం గ్రామానికి చెంది పామూరు లోని స్వయంకృషి స్వచ్ఛంద సేవా సంస్థలో సభ్యులుగా ఉన్న కుర్రా నరేష్‌యాదవ్ సహకారంతో స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలోని 80 మంది ఇంటర్‌మీడియెట్ విద్యార్థులకు మంగళవారం ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యం నిర్దేశించుకుని చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యలో బాలికలే ప్రథమ స్థానంలో నిలుస్తున్నారన్నారు. ఇష్టంతో చదివితే లక్ష్య సాధన కష్టం కాదన్నారు. కేజీబీవీ ప్రిన్స్‌పాల్ కె.సజన అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్వయం కృషి సేవా సంస్థ అధ్యక్షుడు షేక్ నాయబ్‌రసూల్, సభ్యులు కుర్రా నరేష్‌యాదవ్, మూరం భార్గవ్, సర్పంచ్‌ల సంఘం జిల్లా కార్యదర్శి బొట్ల చిరంజీవి, డీజీపేట మాజీ ఎంపీటీసీ మతికేల గురవయ్య, చిట్ల శివన్నారాయణ, బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, ఇర్ల వీరాంజనేయులు, తిమ్మిశెట్టి అంకబాబు, కేజీబీవీ అధ్యాపక సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.



సామగ్రి అందజేస్తున్న ఎంపీపీ, దాతలు

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



పామూరు: అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే దుకాణ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని దర్శి సబ్‌డివిజన్ ఇన్‌చార్జ్ ఏడీఏ నిర్మలాదేవి అన్నారు. పామూరులోని 3 రిటైల్ ఎరువుల దుకాణాలను మంగళవారం రాత్రి ఇన్‌చార్జి ఏడీఏ నిర్మలాదేవి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా దుకాణాల్లోని రికార్డులు, గోడౌన్‌లోని ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఇందులో భాగంగా ఎరువుల దుకాణం లైసెన్స్ కాలపరిమితులు, ఎరువుల కొనుగోలుకు సంబంధించిన ఇన్వాయిస్‌లు పరిశీలించారు. రైతులు బిల్లులు లేకుండా ఎరువులు కొనుగోలు చేయవద్దని సూచించారు. తనిఖీల్లో ఏడీఏ వెంట మండల వ్యవసాయాధికారి కంచం రాధ పాల్గొన్నారు.

దాతల సహకారంతో ఫెన్సింగ్ ఏర్పాటు

ఉలవపాడు: ఉలవపాడు లోని సీహెచ్‌సీ వైద్యశాలలో గార్డెన్ కు దాతల సహకారంతో ఫెన్సింగ్ ఏర్పాటుచేయనున్నట్లు పిల్లల వైద్య నిపుణులు సతీష్ బాబు తెలిపారు. మొక్కల పరిరక్షణకు రూ.25 వేలతో ఈ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ఇంటర్మీడియెట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



సీఎస్‌పురంలో పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు



పామూరు పరీక్ష కేంద్రంలో నంబర్లు వేస్తున్న సిబ్బంది

సీఎస్‌పురం: ఇంటర్మీడియెట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పరీక్షల చీఫ్ అధికారి కటకం సజన తెలిపారు. ఈ నెల 16 నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో పరీక్షల నిర్వహణకు స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో 7 గదులను కేటాయించారు. పరీక్షల చీఫ్ అధికారి కె, సజన, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ ఆదినారాయణ మంగళవారం పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక కేజీబీవీ విద్యార్థులతో పాటు, రత్నం జూనియర్ కళాశాలకు చెందిన 215 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 127 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 88 మంది పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు.

సింగరాయకొండ: మండలంలో ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రభుత్వ జూనియర్ కాలేజీ పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ జి.రాధారాణి తెలిపారు. మండలంలో ఏఆర్‌సీ అండ్ జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ కేంద్రంలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 253 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 259 మంది, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 201 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 198 మంది పరీక్ష రాయనున్నట్లు వివరించారు. విద్యార్థులు 8.30 గంటలకు పరీక్ష కేంద్రానికి రావాలని సూచించారు.

కందుకూరు రూరల్: పట్టణంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో ఇంటర్మీడియెట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఆయా పరీక్ష కేంద్రాలు చీఫ్ సూపరింటెండెంట్‌లు తెలిపారు. టీఆర్‌ఆర్ జూనియర్ కళాశాలలో 484 మంది, గాయత్రి కళాశాలలో 520 మంది, శ్రీ వివేకా కళాశాలలో 520 మంది, నారాయణ కళాశాలలో 360 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పరీక్ష కేంద్రాల చీఫ్‌లు టి.సుబ్బారావు, రవీంద్ర, లావణ్యలత, మాధవరావు తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే పరీక్షకు 8.30 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు. విద్యార్థులు ఎలాంటి హడావిడి, ఒత్తిడి లేకుండా పరీక్షలకు సమయానికి చేరుకొని ప్రశాంతంగా పరీక్షలు రాయలన్నారు.

పామూరు: ఇంటర్మీడియెట్ పరీక్షలు బుధవారం ప్రారంభం కానున్నాయి. పామూరులో ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణకు ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఒమేగా జూనియర్ కళాశాల, ఆదిత్య జూనియర్ కళాశాలలు కేటాయించారు. ప్రథమ సంవత్సర పరీక్షకు 719 మంది విద్యార్థులు, రెండవరోజు గురువారం ద్వితీయ సంవత్సరంకు సంబంధించి 640 మంది విద్యార్థులు తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ, ఒకేషనల్ పరీక్షలకు హాజరుకానున్నారని ఆయా కేంద్రాల డీఓలు, సీఎస్‌లు తెలిపారు. పరీక్ష ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు జరుగుతుందని విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి ఉదయం 8.30 గంటల నుంచి అనుమతిస్తామని 9 గంటల తరువాత అనుమతి ఉండదన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతుల పరిశీలన



ప్రకృతి వ్యవసాయ పద్ధతుల గురించి వివరిస్తున్న విజయలక్ష్మి

టంగుటూరు: మండలంలోని మర్లపాడు గ్రామంలో రైతు సాధికార సంస్థ ఏపీసీఎన్ఎఫ్ ఆధ్వర్యంలో యలమంద అనే రైతు 1.5 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన మిర్చి పంటను రెయిన్ ఫారెస్ట్ అలయన్స్ ప్రతినిధులు మంగళవారం సందర్శించారు. పంట సాగు చేసిన విధానం వివరాలు తెలుసుకున్నారు. రసాయన అవశేషాల పరీక్ష నిర్వహించి లేవని నిర్ధారించారు. అనంతరం లద్దెపురుగు, పచ్చపురుగు నివారణ కోసం అగ్ని అస్త్రం, మొక్క ఎదుగుదల కోసం కోడిగుడ్డు నిమ్మరసం తయారీ గురించి ప్రకృతి వ్యవసాయాధికారులు వెంకట్రావు, విజయలక్ష్మి వివరించారు. మార్కెట్‌లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందని పేర్కొన్నారు. ఈ ఏడాది టంగుటూరు మండలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తున్న రైతుల సంఖ్య గణనీయంగా పెరిగిందని చెప్పారు. కార్యక్రమంలో రెయిన్ ఫారెస్ట్ అలయన్స్ నుండి మనోజ్, భవిత్, ఎస్‌పీఎంయూ నుంచి చైతన్య, జిల్లా మార్కెటింగ్ ఎన్ఎఫ్ఏ మహేష్, ఐసీఆర్పీలు శృతి, మరియమ్మ, రాఘవయ పాల్గొన్నారు

వినియోగదారుల సమస్యలు పరిష్కరించాలి



వినియోగదారుల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న ఇమ్మానియేల్

కందుకూరు అర్బన్: విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించాలని విశ్రాంత జడ్జి ఎస్ విక్టర్ ఇమ్మానియేల్ అన్నారు. స్థానిక కనిగిరి రోడ్డులోని తిరుమల ఫంక్షన్ హాలులో ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ, విజయవాడ వారి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమంనిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షులుగా విశ్రాంత జడ్జి ఎస్. విక్టర్ ఇమ్మానుయేల్ పాల్గొని విద్యుత్ వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా విక్టర్ ఇమ్మానియేల్ మాట్లాడుతూ విద్యుత్ అదాలత్‌లో 15 అర్జీలు రాగా, వాటిలో విద్యుత్ బిల్లులు ఎక్కువగా వచ్చాయని ఫిర్యాదు చేశారని, వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం విద్యుత్ శాఖాధికారులతో ఆ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ సత్యనారాయణ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు మంజూరైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను వారం రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులకు సమస్యలు రాకుండా వారికి న్యాయం చేయాలన్నారు. నిర్ణీత గడువులోగా అప్పగించిన పనులు పూర్తి చేయకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈఈ వీరయ్య, ఏఈలు పాల్గొన్నారు.

113 మందికి వైద్య పరీక్షలు



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న హుసేన్‌రెడ్డి, డాక్టర్ రాంప్రసాద్

పామూరు: సూర్యచంద్ర సేవా సంస్థ, వాసవీ క్లబ్స్ డీవీ మనోహన్ ఆధ్వర్యంలో నెల్లూరు మెడికవర్ వైద్యశాల సహకారంతో స్థానిక పద్మావతి గెస్ట్‌హౌస్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 113 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, మెడికవర్ హాస్పిటల్‌కు చెందిన కార్డియాలజిస్ట్ డాక్టర్ కడియాల రాంప్రసాద్, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, యాదాల వెంకట సాయికిరణ్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ సురేష్‌కుమార్, మార్కెటింగ్ అసోసియేట్ ప్రసన్నకుమార్, వాసవీక్లబ్స్ సభ్యులు దరిశి మస్తాన్‌రావు, కోటా సురేష్, శేగు క్రిష్ణయ్య, యేల్చూరి బాలకొండలరావు, ముప్పసాని రాఘవ, గురునాథం పాల్గొన్నారు.